
సాక్షి గుంటూరు

శనివారం । 6 । ఏప్రిల్ । 2024

I



స్తంభోద్భవంలో నృసింహస్వామి

మంగళగిరి: స్థానిక శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి స్తంభోద్భవం అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



ప్రత్యేక బలగాల కవాతు

గుంటూరు ఈస్ట్: నగరంపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో పలు కాలనీల్లో ప్రత్యేక బలగాల కవాతు నిర్వహించాయి. ఎస్‌హెచ్‌ఓ లోకనాథం కవాతులో పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శని)	సహరి (ఆది)
గుంటూరు	6.26	4.42
నరసరావుపేట	6.28	4.44
బాపట్ల	6.26	4.42

న్యూస్‌రీల్

ఘనంగా హరిద్ర శృంగార్చన



పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలులోని బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం హరిద్ర శృంగారార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలిచైర్మన్ ఎం.ప్రభాకర్‌రెడ్డి సభ్యులు పాల్గొన్నారు.

ఏపీ కేడర్‌కు విజయ్‌బాబు



తెనాలి: సివిల్స్ ర్యాంకర్, ఐఆర్‌ఎస్‌కు ఎంపికైన దోనేపూడి విజయ్‌బాబు ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు నియమితులయ్యారు. నాగపూర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్‌లో శిక్షణ పూర్తిచేసుకున్న ఐఆర్‌ఎస్ అధికారులను ఆదాయ పన్ను అసిస్టెంట్ కమిషనర్లుగా నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 56 మందిని వివిధ కేడర్లకు కేటాయించగా ఆరుగురిని ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు కేటాయించింది. వీరిలో తెనాలి పట్టణానికి చెందిన విజయ్‌బాబు ఒకరు. 2021లో కేవలం 22 ఏళ్ల వయసులోనే విజయ్‌బాబు తన తొలి ప్రయత్నంలోనే సివిల్స్‌లో 682 ర్యాంక్ సాధించారు. ఐఆర్‌ఎస్‌కు ఎంపికయ్యారు. శిక్షణ అనంతరం సొంత రాష్ట్రానికే కేటాయించటంపై సంతోషాన్ని వ్యక్తం చేశారు. విజయ్‌బాబు తండ్రి మధుబాబు ఇప్పటికే ఐఆర్‌ఎస్ అసిస్టెంట్ కమిషనర్ సెంట్రల్ జీఎస్టీగా పని చేస్తున్నారు.

ఈనాడు రోత రాతలపై చర్యలు తీసుకోండి

మాజీ పీపీ బాలహనుమంతారెడ్డి వినతి



నరసరావుపేట: ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన ఈనాడు దినపత్రిక, పబ్లికేషన్స్, జర్నలిస్టులపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎల్.శివశంకర్‌కు జిల్లా కోర్టు మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్, న్యాయవాది కాకుమాను బాల హనుమంతారెడ్డి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అసత్యమైన, సత్యదూరమైన విషయాలతో ఈనెల 4న అసుర.. అసుర.. భూభకాసుర, జగనన్న పాపాలు అనే హెడ్డింగ్‌తో వార్తలను ప్రచురించి ఆయనను నమ్మే అభిమానులను మార్చే కుట్రతో వ్యవహరిస్తోందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇది ముఖ్యమంత్రి వ్యక్తిగత ప్రతిష్ట, పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా ఉన్నాయని చెప్పారు. అలాగే ఈనెల 5న ఈనాడు మెయిన్ ఎడిషన్ బ్యానర్ ఐటమ్‌గా వీళ్లా కొత్త ఎస్పీలు, సగానికి పైగా వైఎస్సార్ సీపీ విధేయులే.. అధికార మెప్పుకోసం ప్రతిపక్షాలను అణచివేసిన చరిత్ర వారిది అంటూ ఎన్నికల సంఘం నియమించిన అధికారులపై ప్రజల్లో వ్యతిరేక ముద్ర వేసే విధంగా, వారి సమర్థతను శంకించే విధంగా వార్తను ప్రచురించిందన్నారు. ఈ విధంగా ప్రచురించిన ఈనాడు పత్రికపై చర్యలు తీసుకోవాలని ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు.

మూడు కిలోల బంగారం ఆభరణాలు ధరించి శ్రీవారి దర్శనం



తిరుమల: గుంటూరు జిల్లా పెదవడ్లపూడి గ్రామానికి చెందిన గడ్డిపాటి సాంబశివరావు శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. గడ్డిపాటి సాంబశివరావు తన శరీరంపై దాదాపు మూడు కేజీల బంగారం ఆభరణాలు ధరించిన భక్తుడిగా నిలిచారు. ప్రతి సంవత్సరం స్వామివారిని దర్శించుకుంటానని స్వామిపై ఉన్న భక్తి ప్రపత్తులతో ప్రత్యేకంగా డాలరును సైతం తయారు చేయించుకున్నానని చెప్పారు.

8న మేమంతా సిద్ధం..!

పల్నాడు జిల్లాకు రానున్న సీఎం వైఎస్ జగన్ బస్సు యాత్ర

- యాత్రను విజయవంతం చేయాలి
- ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే బొల్లా పిలుపు
- పింఛన్ లబ్ధిదారుల మృతికి చంద్రబాబే బాధ్యుడు



పిడుగురాళ్లలో నిర్వహించనున్న సీఎం సభకు స్థలాన్ని పరిశీలిస్తున్న సీఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

వినుకొండ(నూజెండ్ల): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఈ నెల 8వ తేదీన పల్నాడు జిల్లాకు రానున్నట్లు రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎంపీ అభ్యర్థి పి.అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుతో కలసి శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బస్సు యాత్ర జిల్లాలోని వినుకొండ నుంచి ప్రారంభమవుతుందని చెప్పారు. నరసరావుపేట పార్లమెంటు పరిధిలో పిడుగురాళ్ల, గురజాలలో కూడా యాత్ర కొనసాగుతుందని వెల్లడించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో రెండేళ్లు కరోనా కష్టకాలాన్ని అధిగమించి సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని చెప్పారు. వినుకొండ అభివృద్ధిలో స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఎనలేని కృషి చేశారని కితాబు ఇచ్చారు. బస్సు యాత్ర విజయవంతం చేయడంతో పాటు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

- ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని పేర్కొన్నారు. వినుకొండలో యాత్రను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రతిపక్షాలు తనను కుక్కతో పోలుస్తూ విమర్శలు చేసినప్పటికీ తనకు బాధ లేదని, విశ్వాసం ఉన్న వ్యక్తిని కాబట్టే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వెంటనే నడుస్తున్నానని ఘాటుగా స్పందించారు. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యాయని ఓర్వలేని ప్రతిపక్షాలు అసత్యప్రచారాలు మానుకోవాలని హెచ్చరించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వలంటీర్ల సేవలను కూడా రాజకీయం చేస్తూ అవ్వాతాతల పింఛన్ పంపిణీని అడ్డుకున్నది తెలుగుదేశం పార్టీ కాదా అని ప్రశ్నించారు. నరసరావుపేట ఎంపీగా ఉన్న లావు శ్రీకృష్ణదేవరాయలు, వరికపూడిశెల ప్రాజెక్టు విషయంలో అసత్యాలు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం నుంచి అన్ని అనుమతులు తీసుకొచ్చారని, అనంతరం వరికపూడిశెల ప్రాజెక్టు పనులు ప్రారంభించారని గుర్తుచేశారు. పల్నాడు ప్రాంతంలో మెడికల్ కాలేజీ, హైవే నిర్మాణం ముఖ్యమంత్రి కృషి లేకుండా ఎంపీతో ఎలా సాధ్యమని ప్రశ్నించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పక్కన ఎమ్మెల్యే బొల్లా, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్

సభా ప్రాంగణం పరిశీలన

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణ సమీపంలో త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించనున్న మేమంతా సిద్ధం భారీ బహిరంగ సభకు స్థలాన్ని సీఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. అయ్యప్ప స్వామిదేవస్థానం సమీపంలోని ప్రాంగణాన్ని గుర్తించి, త్వరలో జరగబోయే మేమంతా సిద్ధం సభకు కావాల్సిన ఏర్పాట్లను పలు సూచనలు, సలహాలను పార్టీ శ్రేణులకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ చింతా సుబ్బారెడ్డి, ఎంపీపీ అల్లు పిచ్చిరెడ్డి, ముడేల వెంకటేశ్వరరెడ్డి, మట్టారెడ్డి, బీరవల్లి విజయ్‌భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ వినుకొండలో తాగునీటి సమస్యను పరిష్కరించిన ఘనత తమదే అని, ఎవరు ఎన్ని విమర్శలు చేసినా వాస్తవాలు ప్రజలకు తెలుసని అన్నారు.

13న వినుకొండలో బీసీ గర్జన

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలో బీసీ గర్జన ఈ నెల 13వ తేదీ నిర్వహించనున్నట్లు రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో బీసీ గర్జన పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ బీసీలకు సామాజిక న్యాయం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతోందని చెప్పారు. 2019 ఎన్నికల్లో 21 ఎమ్మెల్యే సీట్లు బీసీలకు కేటాయించారని, 2024 ఎన్నికల్లో 48 మంది బీసీలకు ఎమ్మెల్యే సీట్లు, 11 ఎంపీ సీట్లు ఇచ్చి బీసీలకు అగ్రతాంబులం కల్పించారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు బీసీ గర్జనను విజయవంతం చేయాలని కోరారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎంపీ ఆళ్ల, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే బొల్లా

గూడ్స్ రైలులో చెలరేగిన మంటలు

అప్రమత్తమైన కృష్ణాకెనాల్ జంక్షన్ సిబ్బంది



మంటలను అదుపుచేస్తున్న మంగళగిరి అగ్నిమాపక సిబ్బంది

తాడేపల్లిరూరల్ : మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని కృష్ణాకెనాల్ జంక్షన్ పరిధిలో విజయవాడ వైపు నుంచి గుంటూరు వైపు బొగ్గులోడ్‌తో వెళ్తున్న గూడ్స్ రైల్‌లో ఓ బోగిలో మంటలు చెలరేగాయి. అది గమనించిన కృష్ణాకెనాల్ స్టేషన్ మాస్టర్, సిబ్బంది అప్రమత్తమై గుంటూరు వైపు వెళ్తున్న రైల్‌ను నిలిపివేసి మంగళగిరి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. మంగళగిరి ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని గూడ్స్‌రైల్‌లో ఉన్న బొగ్గు నుంచి మంటలు రావడాన్ని గమనించి తన సిబ్బందితో రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు. దీంతో రైల్వే అధికారులు, ఫైర్ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4000, గరిష్ట ధర రూ.6000, మోడల్ ధర రూ.5000 వరకు పలికింది.

బడుగుల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్



బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి విడదల రజిని, ప్రభుత్వ విప్ అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు కిలారి, పశ్చిమ ఎమ్మెల్యే గిరిధర్, డెప్యూటీ మేయర్ బాలవజ్రబాబు తదితరులు

- సామాజిక వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు

పట్నంబజారు: కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా దేశంలో హరిత విప్లవానికి సారథ్యం వహించిన ఘనత బాబూ జగ్జీవన్‌రామ్‌దేనని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ నియోజవకర్గ అభ్యర్థి విడదల రజిని పేర్కొన్నారు. గుంటూరు చంద్రమౌళి నగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం మాజీ ఉపప్రధాని జగ్జీవన్‌రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ దళిత నాయకుడు బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. ఆయనకు గుంటూరుతో విడదీయరాని బంధం ఉందని, 1977 మార్చిలో గుంటూరులో హాజరైన జగ్జీవన్ రామ్ బహిరంగ సభకు లక్షలాది మంది ప్రజలు విచ్చేశారని గుర్తు చేశారు.

- శాసనమండలి విప్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ బాబూ జగ్జీవన్‌రామ్ అట్టడుగు వర్గాల ఆశాజ్యోతి అని, అంబేడ్కర్ సూచించిన మార్గంలో నడిచి ఆచరణలో దళితులకు రాజ్యాధికారం సాధించే దిశగా కృషి చేశారని వివరించారు.
- గుంటూరు ఎంపీ అభ్యర్థి, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్య మాట్లాడుతూ 33 ఏళ్లు కేంద్ర మంత్రిగా, ఉప ప్రధానిగా చేసిన ఏకైక దళిత నాయకుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని, దళిత జాతి ఆణిముత్యాల్లో ఆయన ఒకరని పేర్కొన్నారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ నవ భారత నిర్మాణంలో నాలుగు దశాబ్దాల పాటు అవిరళ కృషి చేసిన బాబూ జగ్జీవన్‌రామ్ చిరస్మరణీయుడని, ఆయన దళిత జాతికే కాకుండా దేశానికి విశేష సేవలందించారని కొనియాడారు. సమావేశంలో డెప్యూటీ మేయర్ డైమండ్ బాబు పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నివాళి

పట్టాభిపురంలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి మంత్రి విడదల రజిని పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆమెతో పాటు పొన్నూరు ఎమ్మెల్యే, పార్టీ ఎంపీ అభ్యర్థి కిలారి రోశయ్య, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరి ఉన్నారు.

వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలవండి



పేద వర్గాలకు అండగా నిలబడి, కాపు కుటుంబ సభ్యులను అన్ని వేళలా ఆదుకునే తులసి కుటుంబం రానున్న ఎన్నికల్లో మద్దతుగా నిలవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అభ్యర్థించారు. గుంటూరు నగరంలోని వేద సీడ్స్ అధినేత తులసి ధర్మచరణ్‌ను ఆయన కార్యాలయంలో మంత్రి విడదల రజిని, కుమారస్వామి దంపతులు శుక్రవారం కలిశారు. రానున్న ఎన్నికల్లో మద్దతు కోరారు. తులసి ధర్మచరణ్‌ను దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత విడదల గోపి పాల్గొన్నారు. – పట్నంబజారు

వైఎస్సార్ సీపీ క్లీన్ స్వీప్ ఖాయం

- కుప్పంలో బాబు, మంగళగిరిలో లోకేశ్, పిఠాపురంలో పవన్ ఔట్
- సర్వేల సారాంశం తెలిపిన ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి
- ఇంటి వద్దకే పాలన–ఇంటింటా సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ జగన్ సీఎం కావాల్సిందే: మంత్రి విడదల రజిని



మాట్లాడుతున్న మంత్రి రజిని, విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎంపీ అభ్యర్థి కిలారి, పశ్చిమ ఎమ్మెల్యే గిరిధర్

పట్నంబజారు: రానున్న ఎన్నికల్లో 175 అసెంబ్లీ నియోజకవర్గాలకు 175, 25 పార్లమెంట్ స్థానాలకు 25 కై వసం చేసుకుని, రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ క్లీన్ స్వీప్ చేస్తుందని శాసనమండలి విప్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని బ్రాడీపేటలో శిఖాకొల్లి జ్వాలా నరసింహారావు నివాసంలో వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి విప్ లేళ్ల అప్పిరెడ్డి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని, పొన్నూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి రోశయ్య, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ హాజరయ్యారు.

- ఈ సందర్భంగా విప్ అప్పిరెడ్డి మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబు, మంగళగిరిలో లోకేశ్, పిఠాపురంలో పవన్ కల్యాణ్ ఓడిపోవడం ఖాయమని చెప్పారు. ఇది ప్రఖ్యాత సర్వేలన్నీ తేల్చి చెప్పిన నిజమని వివరించారు. జయప్రదంగా జరిగిన జగనన్న సిద్ధం సభలు, ప్రస్తుతం జరుగుతున్న బస్సు యాత్రకు ఊళ్లకు ఊళ్లు తరలివస్తున్న తీరు, మండుటెండలు, అర్ధరాత్రి అపరాత్రి అన్న తేడా లేకుండా జగనన్నను కన్నులారా చూసేందుకు పోటెత్తుతున్న జన సంద్రాన్ని చూసి కూటమికి అప్పుడే ఓటమి భయం పట్టుకుందని ఎద్దేవా చేశారు. అందుకే ఒక్క చంద్రబాబు మాత్రమే కాక సాక్ష్యాత్తు ఆయన వదిన అయిన బీజేపీ నేత పురందేశ్వరి చివరికి అధికారులపై కూడా పిటిషన్లు పెట్టే స్థాయికి దిగజారినట్లు ఆరోపించారు.
- సీఎం జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే ఇంటి వద్దకు పాలన.. ఇంటింటా సంక్షేమం దిగ్విజయంగా కొనసాగుతాయని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని వెల్లడించారు. ప్రజలే నేరుగా సీఎం వైఎస్ జగన్ కావాలని డిసైడ్ అయినట్లు చెప్పారు. ప్రపంచంలో మరెక్కడా లేని విధంగా ఇంటి వద్దకు పాలన చేరువ చేసిన గొప్ప ముఖ్యమంత్రిగా జగనన్న అని కొనియాడారు. వలంటీర్ వ్యవస్థను కూటమి నేతలంతా కలిసి కక్షపూరితంగా వ్యవహరించడం ద్వారా ఆంక్షలతో అస్తవ్యస్తం చేశారని ఆరోపించారు. ఫలితంగా ఎన్ని ఇబ్బందులు ఎదురయ్యాయో ప్రజలే స్వయంగా చూస్తున్నారని పేర్కొన్నారు. కూటమి అధికారంలోకి వస్తే ఇలాంటి ఎన్నో ఇక్కట్లకు ఇలా గురవుతూనే ఉండాల్సి వస్తుందన్న వాస్తవాన్ని ప్రజలు గుర్తెరిగినట్లు ఆమె చెప్పారు. సీఎం జగనన్న పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాలు పూర్తి సంతోషంగా ఉన్నట్లు తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు సీఎం జగన్ పెద్ద పీట వేయడంతో పాటు ప్రత్యేకించి మహిళల రక్షణకు, మహిళా సాధికారతకు ఆయన కృషి చేసిన తీరు అనిర్వచనీయమన్నారు. అమ్మ ఒడి తదితర పథకాల ద్వారా చివరికి చిన్న పిల్లల హృదయాలలో కూడా చెరగని ముద్ర వేసుకున్న ముఖ్యమంత్రిగా జగనన్న సరికొత్త చరిత్ర సృష్టించారని వివరించారు. ఈ నేపథ్యంలో మళ్లీ ఆయనను ముఖ్యమంత్రి చేసేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నట్లు మంత్రి విడదల రజిని ప్రకటించారు.
- గుంటూరు లోక్‌సభ అభ్యర్థి, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్య మాట్లాడుతూ దేశంలోనే మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని కొనియాడారు. ఓ వైపు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు రాష్ట్రంలో సామాజిక న్యాయాన్ని కూడా సీఎం సవ్యంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. అన్ని రంగాల్లో అభివృద్ధికి పునాది వేయడం ద్వారా దేశంలోనే ది బెస్ట్ రాష్ట్రంగా ఏపీని నిలిపారన్నారు. ఎన్నికల ప్రచారంలో తిరుగుతున్న చంద్రబాబు ముందు రాష్ట్రాభివృద్ధికి ఏం చేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ బసివిరెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుందరరామశర్మ, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, గీతామందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, మిర్చి యార్డు మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు నూనె ఉమామహేశ్వరరెడ్డి, బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి, వలివేటి వెంకటరమణ, అరవ తిమ్మరాజు, మన్నేపల్లి హనుమంతరావు, జక్కా శ్రీను, మహేంద్ర గులేచా, అత్తోట జోసఫ్, డేవిడ్, మేడా సాంబశివరావు, జగన్ కోటి, కొత్తపేట సతీష్, జాన్సీ, విజయమాధవి, సత్యవతి, విజయమ్మ, వనజాక్షి, ఆలా కిరణ్, మాదాసు కిరణ్, సింగు నరసింహారావు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు అంటే చంద్రబాబుకు చులకన

- గంజాయి అమ్మేది చంద్రబాబు అండ్ కో బ్యాచ్
- కిరాణా వ్యాపారులకు బహిరంగ క్షమాపణ చెప్పాలి
- ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్



మాట్లాడుతున్న కుప్పం ప్రసాద్

సత్తెనపల్లి: ఆర్యవైశ్యులు అంటే ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడుకి చులకన అని ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ అన్నారు. సత్తెనపల్లిలోని మున్సిపల్ చైర్‌పర్సన్ చలంచర్ల లక్ష్మీ తులసి గృహంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్యవైశ్యులపై చంద్రబాబు విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. ఆర్యవైశ్యులు కిరాణా షాపుల్లో గంజాయి అమ్ముతున్నారని రావులపాలెం సభలో ఆరోపణలు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. శనివారం సత్తెనపల్లి వస్తున్న చంద్రబాబు నడిరోడ్డులో బేషరతుగా ఆర్యవైశ్యులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. క్షమాపణ చెప్పకపోతే సార్వత్రిక ఎన్నికల నియమావళిని అనుసరిస్తూ చంద్రబాబు వ్యాఖ్యలపై రాష్ట్రంలోని ఆర్యవైశ్యులంతా నిరసనలు చేపడుతామని హెచ్చరించారు. రాష్ట్రం నుంచి ఆర్యవైశ్యులు తరిమి కొడతామన్నారు. ఆర్యవైశ్యులు అంటే చంద్రబాబుకు మొదటి నుంచి చిన్నచూపేనని వివరించారు. మే 13న ఆర్యవైశ్యుల తడాకా ఏమిటో, కిరాణా షాపుల సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. నెల్లూరు జిల్లాకు పొట్టి శ్రీరాములు జిల్లా అని నామకరణం చేయాలని కోరినా రోజంతా పడిగాపులు కాసిన పట్టిపట్టనట్లు వ్యవహరించారన్నారు. అందువల్లనే ఆ పార్టీ నుంచి ఆర్యవైశ్యులంతా బయటకు వచ్చారన్నారు. సమావేశంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పొట్టి రాజేశ్వరరావు, ఆర్యవైశ్య నాయకులు బాలనాగు పూర్ణ, గుంటూరు సుషీంద్రకుమార్, బచ్చు మురళీ, బొగ్గవరపు శ్రీను, దివ్వెల రామకృష్ణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్ కృషి



నరసరావుపేట: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి బాబూ జగ్జీవన్‌రామ్ విశేష కృషి చేశారని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ కొనియాడారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ నేటి యువత ఆయన ఆశయ సాధనకు పాటుపడాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, ఇన్‌చార్జి సాంఘిక సంక్షేమ అధికారి వరలక్ష్మి, యూత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

చిన్నారి మృతదేహానికి పంచనామా

కారెంపూడి: మండలంలోని పేటసన్నెగండ్ల గ్రామంలో 18 నెలల పాప అనుమానాస్పదంగా మృతి చెందిన నేపథ్యంలో తహసీల్దార్ జయవర్ధన్ సమక్షంలో శుక్రవారం శవ పంచనామా చేశారు. ఫోర్స్‌నిక్ నిపుణులు మృతదేహాన్ని వెలికితీశారు. పాప ఎలా మృతి చెందిందనే దానిపై ఆధారాలు సేకరించారు. సమగ్ర నివేదికను త్వరలో పోలీస్ శాఖకు అందించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. తన భర్త గత నెల 31వ తేదీన చంపాడని అనుమానం వ్యక్తం చేస్తూ ఎస్ఐ రామాంజనేయులుకు తల్లి ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్న క్రమంలో తహసీల్దార్ జయవర్ధన్ సమక్షంలో మృతదేహాన్ని వెలికితీసి అధికారులు శవ పంచనామా నిర్వహించారు. ఎస్ఐ రామాంజనేయులు, ఫోర్స్‌నిక్ ల్యాబ్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. పాప మృతికి కారణాన్ని తెలుపుతూ నిపుణులు నివేదిక ఇచ్చిన తర్వాత కేసును దర్యాప్తు చేసి, నిందితుడ్ని పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

సమగ్ర నివేదిక సమర్పించండి

కారెంపూడి: పల్నాడు జిల్లా కారెంపూడి మండలం పేటసన్నెగండ్ల గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసిన 18 నెలల చిన్నారి అనుమానాస్పద మృతిపై విచారణ చేసి వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని జిల్లా అధికారుల్ని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యురాలు బత్తుల పద్మావతి ఆదేశించారు. ఈ మేరకు వారు శుక్రవారం పాప మృతిపై ప్రకటన విడుదల చేశారు. ఇటువంటి ఘటనలు జరగడం దురదృష్టకరమని పేర్కొన్నారు. పోలీస్ అధికారులు స్పందించి వెంటనే కేసు నమోదు చేశారని, బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పిల్లల పెంపకం, చదువు, రక్షణ, సంరక్షణ విషయంలో ఇబ్బందికర పరిస్థితులుంటే స్థానిక సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బందికి లేదా జిల్లా స్థాయిలో బాలల కోసం పని చేస్తున్న అధికారులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

జగ్జీవన్‌రామ్ ఆదర్శనీయుడు

పట్నంబజారు: భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ఇవ్వాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ కోరారు. జగ్జీవన్‌రామ్ జయంతి పురస్కరించుకుని శుక్రవారం హిందూ కళాశాల కూడలిలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ జనం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. స్వాతంత్య్ర సమరయోధుడిగా, ఉప ప్రధానిగా చేసిన సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగాలని సూచించారు. దళిత, బహుజన వర్గాల గొంతుకగా నిలిచిన జగజ్జీవన్‌రామ్ ఆదర్శాలు అందరికీ అనుసరణీయమన్నారు. నాణ్యమైన విద్య, సమాన అవకాశాలను ఆచరణలో అమలు చేసిన మొట్టమొదటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బాబూ జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు చంద్రగిరి ఏసురత్నం, కె.ఎస్.లక్ష్మణరావు, నాయకులు కాకుమాను పున్నారావు, గర్నెపూడి సుధాకర్, కొలకలూరి కోటేశ్వరరావు, అత్తోట జోసఫ్, దాసరి జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ కార్యాలయంలో....

గుంటూరు వెస్ట్: స్వాతంత్య్ర సమరయోధుడు, సుదీర్ఘ కాలం కేంద్ర మంత్రిగా దేశానికి సేవలందించిన బాబూ జగ్జీవన్‌రామ్ గొప్ప సమతా మూర్తని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, జేసీ రాజకుమారి కొనియాడారు. ఆయన 116వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 40 ఏళ్ల కేంద్ర మంత్రిగా వివిధ శాఖల్లో పనిచేసి తనదైన ముద్ర వేశారన్నారు. రక్షణ, రైల్వే, వ్యవసాయ శాఖా మంత్రిగా ఆయన సేవలు మరువలేనివన్నారు. హరిత విప్లవంతోపాటు ఆహార గిడ్డంగుల నిర్మాణాలకు ఆయన తీసుకున్న చర్యలు నేటి యువతరం గుర్తుంచుకోవాలని చెప్పారు. తొలి దళిత ఉప ప్రధాని పదవికి వన్నె తెచ్చారని కొనియాడారు. సమాజంలో కుల మత వైషమ్యాలు తొలగించేందుకు తన వంతు కృషి చేసారని తెలిపారు. డీఆర్వో పెద్ది రోజా, సోషల వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు,



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న డొక్కా మాణిక్య వరప్రసాద్

ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ప్రేమ కుమారి, జిల్లా కోఆపరేటివ్ అధికారి వీరాచారి, జిల్లా అధికారులు బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఎస్పీ కార్యాలయంలో..

నగరంపాలెం: స్థానిక నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు జరిగాయి. తొలుత ఆయన చిత్రపటానికి జిల్లా ఎస్పీ తుషార్ డూడీ పూల మాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన అనుసరించిన ఆదర్శాలు, చూపిన సంస్కరణ మార్గాలను కూడా ఆచరించాలని పేర్కొన్నారు. ఏఎస్పీ (పరిపాలన) జీవీ రమణమూర్తి, ఎస్‌బీ డీఎస్పీ పోతురాజు, సీఐలు వెంకట్రావు, చంద్రశేఖర్, వెంకట ప్రసాద్, మౌలా షరీఫ్, ఆర్ఐలు హరి రెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వాల్యూయేషన్ కేంద్రంలో..

గుంటూరు ఎడ్యుకేషన్: సమ సమాజ స్థాపన కోసం అహర్నిశలు శ్రమించిన బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయాల బాటలో నడవాలని డీఈవో పి.శైలజ పేర్కొన్నారు. శుక్రవారం మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా టెన్త్ స్పాట్ వాల్యూయేషన్ కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా డీఈవో శైలజ మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన ఉత్తమ రాజకీయ వేత్త, రాజనీతిజ్ఞుడిగా జగ్జీవన్‌రామ్ నిలుస్తారని కొనియాడారు. వివిధ శాఖల్లో 40 ఏళ్లపాటు కేంద్ర మంత్రిగా, ఉప ప్రధానిగా సేవలదించారన్నారు. కార్యక్రమంలో డీవైఈవో బలిరామ్, ప్రభుత్వ పరీక్షల విభాగ సహాయ కమిషనర్ వెంకట్‌రెడ్డి, ఎంఈవో పి. వెంకటేశ్వరరావు, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, సీనియర్ హెచ్ఎంలు తిరుమలేష్, భారత్ స్కౌట్స్, గైడ్స్ ఎస్‌వోసీ పి. శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి ఏడుకొండలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, జేసీ రాజకుమారి



ఎస్పీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ తుషార్ డూడీ



టెన్త్ స్పాట్ కేంద్రంలో నివాళులర్పిస్తున్న డీఈవో శైలజ, బలిరామ్, ఖాసిం

నీవు లేవు..నీ ఆశయం బతికుంది

- రిటైర్డ్ పోస్టల్ ఉద్యోగి మృతి
- నేత్రాలు, దేహాన్ని దానం చేసిన కుటుంబసభ్యులు



టి.కృష్ణమూర్తి (ఫైల్)

తెనాలి: ఆయన ఆశయం ఆదర్శం. తనువు చాలించినా తన దేహం పరిశోధనలకు పనికొస్తే చాలనుకున్నారు. అందుకే చనిపోయిన తర్వాత తన కళ్లు మరొకరికి చూపునివ్వాలని, దేహం పరిశోధనలకు ఉపకరించాలని భావించారు. మరణించాక కళ్లు, భౌతికకాయాన్ని దానం చేయాలని కుటుంబసభ్యులకు సూచించగా, ఆయన ఆశయాన్ని వారు నెరవేర్చారు. వివరాల్లోకి వెళితే.. తెనాలి పట్టణం మారీసుపేట అప్పలస్వామి గుడి ఎదురుగా నివసించే టి.కృష్ణమూర్తి (78) తపాలా శాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. గురువారం ఉదయం మృతి చెందారు. తన శరీరాన్ని వైద్య కళాశాలకు దానం చేయాలని కృష్ణమూర్తి కొంతకాలం క్రితమే కుమారులు సురేంద్రబాబు, సుధీర్‌బాబుకు తెలిపారు. ఆ ప్రకారం ఇచ్చిన సమాచారంతో విజయవాడ తాడిగడపలోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ప్రతినిధులు వచ్చి నేత్రాలను సేకరించారు. ఆ తర్వాత ఎన్నారై మెడికల్ కళాశాలకు కృష్ణమూర్తి భౌతిక కాయాన్ని తరలించారు. ఆయన దేహాన్ని వైద్య పరిశోధనల నిమిత్తం ఉపయోగిస్తామని వైద్య కళాశాల ప్రధాన విభాగాధిపతి డాక్టర్ విజయకుమార్ తెలిపారు. కృష్ణమూర్తి ఆశయం నేటి తరానికి ప్రేరణ అని ఆయన కొనియాడారు.

ఏఎస్ఐపై పోక్సో కేసు నమోదు

మేడికొండూరు: ప్రజల ధన, మాన ప్రాణాలు కాపాడాల్సిన పోలీసు అధికారి బాలికను అసభ్యంగా నిందించిన సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. వరసకు సొంత మనుమరాలు అయిన బాలికను ఫోన్‌లో అసభ్యంగా నిందిచండంతో ఆమె మానసికంగా కుంగిపోయి తల్లిదండ్రులకు తెలిపింది. దీంతో వారు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. బొల్లాపల్లి మండలం బండ్లమోటు పోలీసు స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఏలూరి శ్రీనివాసరావు సొంత సోదరి మనుమరాలు అయిన బాలికకు ఫోన్ చేసి అసభ్యంగా నిందలు వేసి, తీవ్ర మానసికంగా కుంగిపోయేలా చేసినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఏఎస్ శ్రీనివాసరావుతో పాటు సమీప బంధువు మరో మహిళపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీఐటీలో అంతర్జాతీయ సదస్సు

తాడికొండ: వీఐటీ- ఏపీ విశ్వ విద్యాలయంలో శుక్రవారం నుంచి ఇన్నోవేషన్ సస్టేనబుల్ బిజినెస్ ప్రాక్టీసెస్ ఇన్ డిజిటల్ ఎరా అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించారు. వీఐటీ- ఏపీ స్కూల్ ఆఫ్ బిజినెస్ న్యూకాజిల్ విశ్వ విద్యాలయం (ఆస్ట్రేలియా) ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ బెటర్ ఫ్యూచర్ (ఆస్ట్రేలియా) సంయుక్త సహకారంతో నిర్వహించిన ఈ సదస్సులో నేటి డిజిటల్ యుగంలో ఇన్నోవేషన్ సుస్థిరత లక్ష్యాలపై కీలక ప్రసంగాలు, ప్యానెల్ చర్చలు, సాంకేతిక సెషన్- ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న వీఐటీ-ఏపీ స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ఇన్‌చార్జ్ డాక్టర్ అరుణ్‌కుమార్ శివకుమార్ మాట్లాడుతూ వ్యాపార వృద్ధి-పర్యావరణ సారథ్యం రెండింటినీ ప్రోత్సహించే ఆధునిక వ్యూహాలు, సాంకేతికతలు ఆదర్శప్రాయమైన పద్ధతులను అన్వేషించడానికి ఈ సదస్సు ఉపయోగపడుతుందన్నారు. సృజనాత్మకత, ఆవిష్కరణ, వ్యవస్థాపకత ప్రాముఖ్యతపై ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశ్యమన్నారు. వర్సిటీ వీసీ డాక్టర్ ఎస్‌వీ కోటారెడ్డి మాట్లాడుతూ అనేక అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు-పరిశ్రమలతో చేసుకున్న ఎంవోయులు విశ్వవిద్యాలయానికే తలమానికమన్నారు. వర్సిటీలోని ఇన్నోవేషన్-ఇంక్యుబేషన్ సెంటర్ల ద్వారా విద్యార్థుల్లోని యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు నిధులు కూడా అందజేస్తున్నామన్నారు. ఈ సౌకర్యాలను వీఐటీ-ఏపీ వర్సిటీలో ప్రతి విద్యార్థి ఉపయోగించుకుని ఉన్నతంగా ఎదగాలన్నారు. 2023 ఏడాదిలో 1050 కంటే ఎక్కువ పరిశోధనాత్మక ప్రచురణలు, 500 కంటే ఎక్కువ పేటెంట్లను దాఖలు చేసిన ఘనత తమ వర్సిటీ సాధించిందన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో అవలంభించాల్సిన స్థిరమైన విధానాలను వివరించారు. పాలసీ-రిస్క్ మేనేజ్‌మెంట్‌లతో ఆవిష్కరణల స్థిరత్వాన్ని నిర్దేశించేందుకు ఈ సదస్సు ఉపయుక్తంగా ఉంటుందని అభిప్రాయ పడ్డారు. ఈ కార్యక్రమంలో అతిథులు యూఎస్ఏకు చెందిన డిజైన్ రిక్రూటింగ్, జేపీ మోర్గాన్ చేజ్ ప్రతినిధి పాప్స్ ముప్పా, న్యూకాలజికల్ బిజినెస్ స్కూల్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మార్టీ చియా, వర్సిటీ రీసెర్చ్ డీన్ డాక్టర్ రవీంద్ర ధూలి, జయశ్రీ గోపాల్, డాక్టర్ సీతా లక్ష్మీ, డాక్టర్ మొహమ్మద్ అబ్దుల్ ముఖీత్ మాజ్, పలు వర్సిటీల ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు, వీసీ, రిజిస్ట్రార్

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

నగరంపాలెం: భారత మాజీ ఉప ప్రధాని, దివంగత జగ్జీవన్‌రామ్ జయంతిని జరుపుకోవడం అభినందనీయమని హైకోర్టు జడ్జి కె.మన్మథరావు అన్నారు. జిల్లా కోర్టులోని ది గుంటూరు బార్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం జగ్జీవన్‌రామ్ 116వ జయంత్యుత్సవాలు నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా హైకోర్టు జడ్జి మన్మథరావు మాట్లాడుతూ మార్పును అందిపుచ్చుకుని ప్రతి ఒక్కరూ ముందుకెళ్లాలని తెలిపారు. జిల్లా జడ్జి పార్థసారథి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎదిగేందుకు ప్రయత్నించాలని చెప్పారు. తమ వంతుగా ఇతరులకు సహాయ, సహకారం అందించాలని సూచించారు. మన పక్కనున్న వాళ్లకి, సమాజానికి ఏం చేయాలనే ఆలోచనతో ముందుకెళ్లాలని తెలిపారు. అనంతరం జగ్జీవన్‌రామ్ జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన న్యాయవాదులకు హైకోర్టు జడ్జి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాలుగో అదనపు జిల్లా జడ్జి శరత్‌బాబు, పోక్సో కోర్టు జడ్జి రామకృష్ణారావు, పలువురు సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు, బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, అసోసియేషన్ కార్యదర్శి అనురాధ, ఉపాధ్యక్షుడు గౌరీశంకర్, కార్యవర్గ సభ్యులు, బార్ మాజీ అధ్యక్షులు పాలడుగు వెంకటేశ్వర్లు, పోలూరి వెంకటరెడ్డి, సి.రవీంద్రబాబు, శాంతకుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి మన్మథరావు

అక్రమంగా నిల్వ చేసిన మద్యం పట్టివేత

- ఢిల్లీ, హరియాణా టూ వరగాని
- ట్రంక్ పెట్టెల్లో నిల్వ.. ఇద్దరి అరెస్టు
- రూ.2.02 లక్షల ఖరీదైన 269 మద్యం సీసాలు స్వాధీనం

నగరంపాలెం: హరియాణా, ఢిల్లీ నుంచి మద్యం అక్రమంగా తీసుకొచ్చి, అధిక ధరలకు విక్రయించే ముఠాలోని ఇద్దరిని సెబ్ పొన్నూరు పోలీసులు అరెస్ట్ చేశారు. ఓ ఇంటిలో నిల్వ చేసిన రూ.2.02 లక్షలు ఖరీదైన 269 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను జిల్లా ఏఎస్పీ (సెబ్) ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. పెదనందిపాడు మండలం వరగాని గ్రామానికి చెందిన చుండూరు నాగ సురేష్ బేల్దార్ పనులకు వెళ్లేవాడు. అదే గ్రామానికి చెందిన గురజాల నాగరాజు, గుమ్మల కోటేశ్వరరావు అతడి స్నేహితులు. లిక్కర్ మాఫియాలో కోటేశ్వరరావు దిట్ట. ఇక నాగ సురేష్, లారీ డ్రైవర్ కోటేశ్వరరావు బాడుగల నిమిత్తం హరియాణా, ఢిల్లీ వెళ్లేవారు. ఈ క్రమంలో ఢిల్లీ శివారులోని హరియాణా రాష్ట్రంలో తక్కువ ధరలకు మద్యం కొనుగోలు చేసేవారు. అనంతరం దాన్ని ఢిల్లీలోని సేఫ్ ఎక్స్‌ప్రెస్ ద్వారా విజయవాడ కార్గోకు బుక్ చేసేవారు. విజయవాడకు సరుకు వచ్చిన తర్వాత నాగ సురేష్, నాగరాజు, కోటేశ్వరరావు ఆటోలో తీసుకువచ్చి పెదనందిపాడు వరగానిలో వ్యవసాయ పనులు చేసే నూనె ఏడుకొండలు ఇంట్లో నిల్వ చేశారు. అతడి ఇంటిని స్టాక్ పాయింట్ స్థావరంగా మలుచుకున్నారు. తెలిసిన వారికే సురేష్, కోటేశ్వరరావు మద్యం విక్రయించేవారు. వచ్చిన నగదులో నలుగురు కొంత తీసుకునేవారని దర్యాప్తులో వెల్లడైంది. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు సెబ్ సూపరింటెండెంట్ ఎల్.రంగారెడ్డి, సహాయ సూపరింటెండెంట్ ఎస్.కృష్ణకిశోర్‌రెడ్డి ఆధ్వర్యంలో పొన్నూరు సెబ్ సీఐ ఎం.సుకన్య, సిబ్బందితో కలిసి గురువారం రాత్రి పెదనందిపాడు వరగాని గ్రామంలోని ఏడుకొండలు ఇంట్లో సోదాలు జరిపారు. ఇనుప ట్రంక్ పెట్టెల్లో నిల్వ చేసిన 269 మద్యం సీసాలను గుర్తించారు. దీంతో నాగసురేష్, ఏడుకొండలను అరెస్ట్ చేసి, రూ.2.02 లక్షలు ఖరీదు చేసే మద్యం స్వాధీనం చేసుకున్నారు. ముఠాలోని మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. కేసులో ప్రతిభ చూపిన వారిని జిల్లా ఏఎస్పీలు ఎం.వెంకటేశ్వరరావు (సెబ్), రమణమూర్తి (పరిపాలన) అభినందించారు.



మద్యం సీసాలను పరిశీలిస్తున్న జిల్లా ఏఎస్పీలు వెంకటేశ్వరరావు, రమణమూర్తి

అదుపు తప్పింది-ఒకరి ప్రాణం తీసింది

- హైవేపై మినీ బస్సు బోల్తా
- మరో నలుగురికి గాయాలు



మృతుడు శేషసాయికుమార్

ప్రత్తిపాడు: మినీ ట్రావెల్స్ బస్సు నేషనల్ బోల్తా పడి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. యడ్లపాడు స్పైసస్ పార్కులో పని చేస్తున్న పన్నెండు మంది ఉద్యోగస్తులను గుంటూరు ఐటీసీ నుంచి ఎక్కించుకుని వస్తున్న మినీ బస్సు తుమ్మలపాలెం జాతీయ రహదారిపై ప్రమాదానికి గురైంది. ఈ వ్యాను మితిమీరిన వేగంతో ప్రయాణిస్తూ హైవేపై ఉన్న ఐరన్ ఫెన్సింగ్‌లను ఢీకొట్టి అదుపుతప్పింది. డ్రైవర్ కుంభా ప్రభుదాసు వాహనాన్ని అదుపు చేయలేకపోవడంతో హైవేకు సర్వీసు రోడ్డుకు మధ్యనున్న రెయిన్ వాటర్ డ్రెయినేజీలోనికి బస్సు దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బస్సు వెనుక భాగంలో కూర్చున్న గుంటూరు రూరల్ మండలం నల్లపాడుకు చెందిన కరణం శేషసాయి కుమార్ (26)కు తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. గుంటూరు నగరానికి చెందిన కె.తేజశ్రీ, రజినీదేవి, శ్రీకాంత్, బాలగోపాల్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు మృతుడి తండ్రి వెంకటేశ్వర రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సోమేశ్వర రావు తెలిపారు. బస్సు గుంటూరు చిన్ని ట్రావెల్స్‌కు చెందినదిగా పోలీసులు గుర్తించారు.



బోల్తా పడిన మినీ బస్సు

కారు ఢీకొని వ్యక్తి మృతి

మార్టూరు: జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఏఎస్సై మహబూబ్‌బాషా వివరాల మేరకు.. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం గోవిందాపురం గ్రామానికి చెందిన నలజర్ల వేములయ్య (36) ద్విచక్ర వాహనంపై మార్టూరు మీదుగా స్వగ్రామం వెళ్తున్నాడు. స్థానిక పెట్రోలు బంకు సమీపంలో అదే మార్గంలో నెల్లూరు నుంచి చిలకలూరిపేట వెళ్తున్న కారు వేములయ్య బైకును వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు డివైడర్‌ను ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఉన్న వేములయ్యను మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు వేములయ్యకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య మధుమతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారకుడైన కారు డ్రైవర్ సలగల వెంకటేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మహబూబ్‌బాషా తెలిపారు.

వైఎస్సార్ సీపీలో పలువురు చేరిక



పార్టీలో చేరిన వారితో నూరిఫాతిమా

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ జెండా భుజాన పెట్టుకుని కష్టపడిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం దక్కుతుందని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమా చెప్పారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా కార్యాలయంలో 57వ డివిజన్ అంబేడ్కర్ నగర్‌కు చెందిన పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి స్వాగతం పలికిన నూరిఫాతిమా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు చూసి పలు పార్టీలకు చెందిన నేతలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీకాంత్, జగదీష్, సందీప్, అరవింద్, సంతోష్, విక్రమ్, దిల్షాద్, యాసిన్, తరుణ్, భాను, తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షునిగా చాంద్ బాషా



ఏపీజీఈఏ నూతన కార్యవర్గం

గుంటూరు వెస్ట్: ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షునిగా సయ్యద్ చాంద్ బాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం స్థానిక యూటీఎఫ్ హాలులో జరిగిన ఎన్నికల్లో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చాంద్ బాషా మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన సమస్యల కోసం రాజీలేని పోరాటం చేస్తానన్నారు. తనకు అప్పగించిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహిస్తానన్నారు. జిల్లా కార్యదర్శిగా కె.వి.ఎస్. శివారెడ్డి, నిర్వాహణా కార్యదర్శిగా కరీముల్లా షాఖదిరి, సహ అధ్యక్షునిగా మహేష్ బాబు, ఉపాధ్యక్షులుగా హుస్సేన్ ఖాన్, డాక్టర్ హనుమంతరావు, కోశాధికారిగా పోతురాజు, సహ కార్యదర్శులుగా శ్రీనివాసరావు, హరికృష్ణ, నగర శాఖ అధ్యక్షుడిగా వై.నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

చంద్రబాబు వ్యాఖ్యల్ని వెనక్కు తీసుకోవాలి

నరసరావుపేట: కిరాణా షాపుల్లో గంజాయి విక్రయిస్తున్నారనే చంద్రబాబునాయుడు వ్యాఖ్యలను వెంటనే వెనక్కు తీసుకొని క్షమాపణ చెప్పకపోతే రాష్ట్ర బంద్ ప్రకటిస్తామని చాంబర్ ఆఫ్ కామర్స్ అసోసియేషన్, కిరాణా షాపు వ్యాపారుల అసోసియేషన్ ప్రతినిధులు హెచ్చరించారు. స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడు కొత్తూరి కిశోర్‌బాబు మాట్లాడారు. రావులపాలెం సభలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వ్యాఖ్యల్ని ఖండించారు. వ్యాపారులు అంటే అంత లోకువగా ఉన్నారా? అని ప్రశ్నించారు. పది రూపాయలకు సరుకు తీసుకొచ్చి 11 రూపాయలకు అమ్మేవారిమే తామని చెప్పారు. ఇప్పటికే వ్యాపారాలు సరిగా లేక తామంతా ఇబ్బందిపడుతున్న సమయంలో చంద్రబాబు వ్యాఖ్యలు తమను తీవ్రంగా బాధిస్తున్నాయని, ఆయన వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు.



దేశం నిశ్శబ్దంగా ఒక ముఖ్యమైన జనాభా మార్పుకు గురవుతోంది.
ఇండియా ఏజింగ్ రిపోర్ట్ 2023 ప్రకారం దేశ జనాభాలో 60 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు గల వారు దాదాపు 15 కోట్ల మంది ఉన్నారు.
ఈ సంఖ్య 2050 నాటికి రెట్టింపు అయ్యే అవకాశం ఉంది.
సంతానోత్పత్తి రేటు తగ్గడం, అందుబాటులోకి వచ్చిన చికిత్సా విధానాల వల్ల భారతదేశ జనాభాలో వృద్ధుల వాటా నిశ్శబ్దంగా పెరుగుతోంది.
అయితే, దీనికి తగినట్టుగా వారి ఆర్థిక శక్తి పెరగడం లేదు.
ఫలితంగా వృద్ధులు సొంత కుటుంబాల నుంచే ఈసడింపులకు, వేధింపులకూ గురవుతున్నారు.
వృద్ధుల జీవితం భరోసాగా గడవడం ఎలా?!

సీనియర్ సిటిజన్స్‌కు భరోసా ఏది?



పాశ్చాత్య దేశాల మాదిరి కాకుండా భారతదేశంలోని 40 శాతం మంది వృద్ధులు అత్యంత పేదరికంలో ఉన్నారు. 60 నుంచి 80 ఏళ్ల వయసులో ఉన్న మహిళలు ఆర్థిక, ఇతర అవసరాల కోసం వారి కుటుంబాలపై పూర్తిగా ఆధారపడి ఉన్నారు. గ్రామీణ వృద్ధులు కుల, వర్గ ఆధారిత వివక్షకూ గురవుతున్నారు.

గ్రామాల్లో పెను సవాల్!

నగరాలలో ఉండే సీనియర్ సిటిజన్స్ జీవితాలతో పోల్చితే గ్రామాల్లో వారి పరిస్థితి దయనీయంగా ఉంది. వీరు కనీస సౌకర్యాలు కూడా లేకుండా జీవిస్తున్నారు. మన ఆరోగ్య విధానం సాధారణంగా మాతా, శిశు సంరక్షణపైనే ఉంటుంది. వృద్ధుల సంరక్షణకు అంతగా ప్రాధాన్యత ఇవ్వడం లేదు. గ్రామీణ వృద్ధులలో ప్రత్యేకించి మహిళలు ఆర్థిక, అవసరాల కోసం వారి కుటుంబాలపై పూర్తిగా ఆధారపడుతున్నారు. మన దేశంలో వృద్ధుల సంరక్షణ ఎక్కువ భాగం వారి పిల్లలు చూసుకోవడం ఆనవాయితీ. అయితే, కాలంతో పాటు ఈ విధానాలూ వేగంగా మారుతున్నాయి.

పిల్లల వలస..

పెరుగుతున్న ఒంటరితనం

విద్య, ఉద్యోగాల కోసం పిల్లలు వలసలు వెళ్లడం, ఉమ్మడి కుటుంబం వ్యవస్థ విచ్ఛిన్నం కావడం, వృద్ధుల సంరక్షణను ప్రశ్నార్థకంగా మార్చింది. నివేదికల ప్రకారం 60 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వ్యక్తులలో 6 శాతం మంది ఒంటరిగా జీవిస్తున్నారు. 20 శాతం మంది పిల్లలు లేకుండా వారి జీవిత భాగస్వామితో మాత్రమే జీవిస్తున్నారు. ఈ సంఖ్య భవిష్యత్తులో గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. తక్కువ ఆదాయ కుటుంబాలలో వృద్ధుల ఆరోగ్య అవసరాలు ఆర్థికంగా భరించలేనంత భారంగా మారుతున్నాయి. భారతదేశంలో వృద్ధులపై వేధింపుల కేసులు కూడా క్రమంగా పెరుగుతున్నాయి. 'హెల్ప్ ఏజ్ ఇండియా' నివేదిక ప్రకారం 25 శాతం మంది పెద్దలు తమ సొంత కుటుంబాల ద్వారా వేధింపులకు గురవుతున్నారు.

సామాజిక భద్రత

హెల్ప్ ఏజ్ ఇండియా సూచనల మేరకు..

- దేశంలో వృద్ధుల కోసం అధికారిక సంస్థాగత సంరక్షణలో పెట్టుబడులను పెంచాల్సిన అవసరం ఉంది. పటిష్ఠమైన పెన్షన్, సామాజిక భద్రతా వ్యవస్థ, మెరుగైన ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలను అందించడం ద్వారా వారి కుటుంబ సభ్యులపై వృద్ధులు ఆధారపడటం తగ్గించవచ్చు.
- దాదాపు 33 శాతం మంది వృద్ధ స్త్రీలకు ఎటువంటి ఆదాయం లేదు. 11 శాతం మందికి మాత్రమే పెన్షన్ ద్వారా ఆదాయం వస్తోంది. 16.3 శాతం మంది సామాజిక పెన్షన్ పొందుతున్నారు. సీనియర్ కేర్ సంస్కరణలపై ఇటీవల 'నీతి అయోగ్' సమర్పించిన ఓ నివేదిక ప్రకారం వృద్ధుల ఆర్థిక సాధికారతను నిర్ధారించడానికి ప్రభుత్వ నిధుల కవరేజీని పెంచడం, తిరిగి పని నైపుణ్యాలవైపు మళ్లించడం, తప్పనిసరి పొదుపు ప్రణాళికలు, రివర్స్ మార్టిగేజ్ మెకానిజమ్స్, పన్ను, జీఎస్టీ సంస్కరణల వంటి అనేక చర్యలు చేపట్టాలని పేర్కొంది.
- ఎటువంటి ఆస్తులు, ఆదాయం లేకుండా ఉన్నవారి అవసరాలకు అనుగుణంగా సంపూర్ణ వృద్ధాప్య సంరక్షణ నమూనాను అభివృద్ధి చేయాల్సి ఉంటుందనేది మరో సూచన.

నలుగురు కలిసి ఉంటే ఎంతో మేలు..

వృద్ధులైనా డబ్బున్నవారి పరిస్థితి బాగానే ఉంది. డబ్బులేని వారే జీవశ్చవాలుగా బతుకీడుస్తున్నారు.

- వృద్ధులకు ఓల్డేజ్ హోమ్స్ తప్ప మరో మార్గం లేదు. ఫుడ్ షెల్టర్ ఈ రెండే ఇస్తుంది. కానీ, ఎమోషనల్‌గా ఒంటరితనం ఫీలవుతుంటారు. అందుకే, రీ మ్యారేజ్ ద్వారా మేం ఒక సొల్యూషన్ చూపిస్తున్నాం. లేదంటే, ఒంటరిగా ఉన్న వృద్ధులు ప్రమాదాలకు, దోపిడీలకు గురవుతున్నారు. ఇలాంటప్పుడు నలుగురు వృద్ధులు కలిసి ఒక చోట ఉండవచ్చు. దీని వల్ల ఒంటరితనం పోగొట్టుకోగలుగుతారు.
- అప్పడాలు, వడియాలు వంటివి చేసి, వ్యాపారం చేసుకోవచ్చు. కానీ, 70 ఏళ్ల వయసులో ఏ పనీ చేయడానికి ఓపిక ఉండదు. పెట్టింది తినడం తప్ప ఏ రకమైన ఫిజికల్ స్ట్రెయిన్ పడలేరు. అందుకని, రూమ్మేట్స్ లాగా కలిసి ఉండాలి. అక్కడ చిన్న చిన్న కార్యక్రమాలు ఏర్పాటు చేసుకోవచ్చు, ఇండోర్‌గేమ్స్, స్థానిక పర్యాటక స్థలాలు చూసి రావచ్చు.
- యువత పట్టించుకోదు, మధ్య వయసువారికి కుటుంబ సమస్యలు. సీనియర్ సిటిజన్స్ పట్ల ఎవరికీ జాలి, దయ ఉండదు. వృద్ధులకు ఇచ్చే ఆత్మీయ స్పర్శను ఎంతో ఓదార్పుగా ఫీలవుతారు.
- రాజకీయ వర్గం తరచుగా యువ జనాభాను ఆర్థిక ఆస్తిగా పేర్కొంటుంది. పెరుగుతున్న వృద్ధ జనాభాకు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక, సామాజిక మద్దతును అందించడానికి అంతగా ఆసక్తి చూపదు. ఏ రకమైన ఆదాయం లేనివారికి ప్రభుత్వమే వారికో దారి చూపించాల్సి ఉంటుంది. ప్రభుత్వం పెన్షన్ రూపేణ వచ్చే వనరుతోనూ నలుగురు కలిసి ఉండవచ్చు.



– ఎస్.ఎమ్.రాజేశ్వరి, తోడు నీడ స్వచ్ఛంధ సంస్థ, హైదరాబాద్

సేవాపథం

సెక్స్–ట్రాఫికింగ్ సర్వైవర్స్‌కు అండగా నిలబడి వారికి ఒక దారి చూపుతోంది రుచిర గుప్తా. యాంటీ–ట్రాఫికింగ్ యాక్టివిస్ట్, యూఎస్ అడ్వైజర్, విజిటింగ్ ప్రొఫెసర్, 'అప్నే ఆప్' కో–ఫౌండర్, రైటర్ రుచిర ఎందరో బాధితులకు అక్కగా, అండగా నిలబడింది.

చీకటి కూపం నుంచి వెన్నెల దారుల్లోకి



రుచిర

యువ జర్నలిస్ట్‌గా రుచిర గుప్తా నేపాల్‌కు వెళ్లింది. 'సహజ వనరులను గ్రామాలు ఏ రకంగా ఉపయోగించుకుంటున్నాయి' అనే అంశంపై కథనాలు రాయడానికి ఎన్నో గ్రామాలకు వెళ్లింది. సహజవనరులకు సంబంధించిన సమాచారం మాట ఎలా ఉన్నా చాలా గ్రామాల్లో వినిపించిన మాట....

'మా ఊళ్లో కొందరు అమ్మాయిలు కనిపించడంలేదు. వారి ఆచూకి తెలియడం లేదు' మారుమూల హిమాలయ కుగ్రామం అయిన సిందుపాల్‌చౌక్‌లో పేకాట ఆడుతున్న వారిని అమ్మాయిల అదృశ్యం గురించి అడిగింది రుచిర.

'వాళ్లు ముంబైలో ఉన్నారు' అని అసలు విషయం చెప్పారు వాళ్లు.

నేపాల్ నుంచి మన దేశానికి వచ్చిన తరువాత ముంబైలోని రెడ్‌లైట్ ఏరియా కామాటిపురాకు వెళ్లింది రుచిర. అక్కడ చిన్న చిన్న గదుల్లో అమ్మాయిలు బంధించి ఉండటాన్ని గమనించింది. బాధగా అనిపించింది. అయితే ఆమె బాధ దగ్గరే ఆగిపోలేదు. 'వారికోసం ఏదైనా చేయాలి' అని మనసులో గట్టిగా అనుకుంది.

నేపాల్ గ్రామాల నుండి ముంబైలోని వ్యభిచార గృహలకు యువతులు, బాలికల అక్రమ రవాణాను బహిర్గతం చేయడానికి కెనడియన్ బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషన్ కోసం 'ది సెల్లింగ్ ఆఫ్ ఇన్నోసెంట్స్' అనే డాక్యుమెంటరీ తీసింది.

ఈ డాక్యుమెంటరీ కోసం ఎంతోమంది అమ్మాయిలతో మాట్లాడింది. వారు చీకటికూపాల్లో చిక్కుకుపోవడానికి ప్రధాన కారణం...కటిక పేదరికం. ఈ డాక్యుమెంటరీ చేస్తున్నప్పుడు ఆమెపై హత్యా ప్రయత్నాలు కూడా జరిగాయి. ఒకడు కత్తితో పొడవడానికి వచ్చినప్పుడు అక్కడ ఉన్న మహిళలు తమ ప్రాణాలను పణంగా పెట్టి మరీ ఆమెను రక్షించారు.

అవుట్ స్టాండింగ్ ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం కోసం ఇచ్చే ఎమ్మీ అవార్డ్‌ను 'ది సెల్లింగ్ ఆఫ్ ఇన్నోసెంట్స్' గెలుచుకుంది.

అవార్డ్ అందుకుంటున్నప్పుడు చప్పట్ల మధ్య, ప్రకాశవంతమైన దీపాల మధ్య ఆమెకు కనిపించిందల్లా చీకటి కొట్టాలలోని బాధితుల కళ్లు మాత్రమే. 'జర్నలిజంలో నేను మరో మెట్టు పైకి చేరడానికి కాకుండా మార్పుకోసం ఈ డాక్యుమెంటరీ ఉపయోగపడాలని కోరుకున్నాను' అంటుంది రుచిర.

అక్రమ రవాణాపై కఠిన చట్టాలు తీసుకురావడానికి సహాయపడాల్సిందిగా అప్పటి యూఎస్ హెల్త్ అండ్ హ్యూమన్ సర్వీసెస్ సెక్రటరీ డోనా షలాలాతో మాట్లాడింది రుచిర. డోనా ద్వారా ఐక్యరాజ్య సమితి సమావేశంలో తన డాక్యుమెంటరీని ప్రదర్శించడమే కాదు వివిధ దేశాలకు చెందిన 180 మంది ప్రతినిధులతో మాట్లాడింది.

ఇరవై రెండు మంది మహిళలతో కలిసి 'అప్నే ఆప్–ఉమెన్ వరల్డ్ వైడ్' అనే స్వచ్ఛంద సంస్థను ప్రారంభించింది రుచిర గుప్తా. అక్రమ రవాణ నిరోధించడానికి, బాధితులకు అన్ని రకాలుగా సహాయం అందించడానికి ఈ సంస్థ అలుపెరుగని కృషి చేస్తోంది. వ్యభిచారాన్ని 'కమర్షియల్ రేప్'గా పిలుస్తున్న 'అప్నే ఆప్' బాధితులకు సంబంధించి విద్య, ఆరోగ్య సంరక్షణ, లైఫ్ స్కిల్స్, చట్టపరమైన రక్షణ, ప్రభుత్వ పథకాలు... మొదలైన వాటిపై దృష్టి పెట్టింది.

ఇప్పటివరకు ఇరవై రెండు వేలమందికి పైగా మహిళలు, బాలికలను వ్యభిచార కూపాల నుంచి బయటికి తీసుకురావడంలో సహాయపడిన రుచిర ఎంతోమంది అమ్మాయిలు చదువుకునేలా చూసింది. సొంత కాళ్ల మీద నిలబడేలా చేసింది.

దేశ, విదేశాలకు చెందిన ఎన్నో ప్రతిష్ఠాత్మక అవార్డ్‌లు అందుకుంది రుచిరా గుప్తా. అయితే వాటి కంటే కూడా చీకటి కూపం నుంచి బయటికి వచ్చిన బాధితుల కంట్లో కనిపించే వెలుగే తనకు అతి పెద్ద అవార్డ్‌గా భావిస్తానంటుంది రుచిర.

ఇంటిప్స్

బూట్ల నుంచి దుర్వాసన రావడానికి ప్రధాన కారణం చెమటతో తడిసిన సాక్స్‌ను అలాగే ఉంచడం, తడీపొడిగా ఉన్న సాక్స్‌ను అలాగే ధరించడం. అందువల్ల సాక్స్ తడిగా కాకుండా చూసుకోవాలి. ● బూట్లను ఉపయోగించిన తర్వాత గాలి ఆడేటట్లు బైట పెట్టాలి. సాక్స్‌ను ఎప్పటికప్పుడు ఉతికేసి ఆరేయాలి. కానీ కొందరు వారం రోజుల పాటు ఒకేజత సాక్స్ లను ధరిస్తారు. దీంతో బూట్లనుంచి భరించలేని దుర్వాసన వస్తుంది. ● ముఖ్యంగా బైటకు రాగానే సాక్స్ తీసి పక్కన పెట్టాలి. షూ లేస్‌ను కూడా ఉతికి ఎప్పటికప్పుడు క్లీన్‌గా ఉంచుకోవాలి. వారానికి ఒకసారి షూస్‌ను కూడా శుభ్రంగా కడిగేసుకోవాలి. ఇలా చేస్తే బ్యాక్టీరియా, వైరస్ ఉండవు. ● నిమ్మకాయ తొక్క లేదా కమలా, నారింజ తొక్కల వంటివి బూట్లలో వేస్తే వాటినుంచి చెడువాసన రాదు. అందుకే రాత్రిపూట కొన్ని నిమ్మ/ నారింజ/ కమలా తొక్కలను బూట్లలో వేసి పొద్దున్నే తీసేయాలి. ఇలా చేస్తుంటే బూట్ల నుంచి దుర్వాసన అనేది ఉండదు. ● తడిగా ఉన్న బూట్లలో బేకింగ్ సోడా వేస్తే మంచి ఫలితం ఉంటుంది. ఇది బూట్లలోని తేమను గ్రహించుకుంటుంది. అందుకే షూస్ వాసన వచ్చినప్పుడు బేకింగ్ సోడా వేస్తుండాలి. కొన్నిరకాల డస్టింగ్ పౌడర్‌లు వేసినా దుర్వాసన రాకుండా ఉంటుంది.



టిప్

బఠాణీతొక్క కూడానూ..



పచ్చిబఠాణీ మనకు ఎంతమేలు చేస్తుందో తెలిసిందే. అయితే బఠాణీ పిక్కలు తీసి తొక్కలను పారేస్తుంటాము. కానీ ఈ తొక్కలు మొక్కలు చక్కని పోషకాలు అందిస్తాయి. అందుకే తొక్కలను మిక్సీజార్‌లో వేసి పేస్టు చేయాలి. ఈ పేస్టులో కాసిన్ని నీళ్లు పోసి వడగట్టాలి. ఈ నీటిని గార్డెన్‌లోని మొక్కలకు పోయాలి. ఈ నీరు మొక్కలు మంచి బలవర్ధకమైన టానిక్‌లా పనిచేసి చక్కగా పెరిగేందుకు దోహదపడతాయి.

స్ఫూర్తి

సైన్స్‌ను సామాన్యుల దగ్గరికి తీసుకుపోవడానికి 'బెంగళూరు సైన్స్ గ్యాలరీ' ద్వారా ప్రయత్నిస్తోంది జాహ్నవి ఫాల్కి. 'సైంటిఫిక్ స్టోరీ టెల్లర్'గా దేశవిదేశాల్లో పేరు తెచ్చుకున్న జాహ్నవి సైన్స్‌కు సంబంధించిన డాక్యుమెంటరీలు తీసింది. పుస్తకాలు రాసింది.

జాహ్నవి సామాన్య శాస్త్రం



జాహ్నవి ఫాల్కి

'అడగడం' 'తెలుసుకోవడం' అనే ప్రక్రియ జాహ్నవికి ఎంతో ఇష్టమైనది. ఆమెకు బాగా నచ్చే మాట... రైట్ క్వశ్చన్. రిసెర్చ్ వర్క్ నుంచి కెరీర్‌కు సంబంధించి డైరెక్షన్‌ను మార్చుకోవడం వరకు 'రైట్ క్వశ్చన్' అనేది ఆమెకు ఎంతో ఉపయోగపడింది. అమెరికాలోని జార్జియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరకు తీసుకెళ్లింది. అక్కడ భారతదేశ శాస్త్ర సాంకేతిక చరిత్రను అధ్యయనం చేసింది.

ఆ చరిత్రపై బాగా ఇష్టాన్ని పెంచుకుంది.

తాను తెలుసుకున్న విషయాలను, తన అభిప్రాయాలను నలుగురితో పంచుకోవడానికి వివిధ మాధ్యమాలను ఎంచుకుంది.

'బాంబే యూనివర్శిటీ'లో సివిక్స్ అండ్ పాలిటిక్స్ చదువుకున్న జాహ్నవి 'జార్జియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ'లో సైన్స్ అండ్ టెక్నాలజీ హిస్టరీలో డాక్టరేట్ చేసింది. సామాజిక శాస్త్రాల అధ్యయనం ద్వారా సామాజిక కోణంలో సైన్స్‌ను అర్థం చేసుకుంది.

ఆమె మాటల్లోనే చెప్పాలంటే 'సైన్స్ అనేది ఒంటరి కాదు'

సైన్స్‌ను ప్రభావితం చేసే అంశాలు సమాజంలో ఎన్నో ఉంటాయి. ఆ అంశాలకు సైన్స్‌కు మధ్య ఉండే అంతః సంబంధాన్ని లోతుగా అధ్యయనం చేసింది.

'ఆటోమిక్ స్టేట్: బిగ్ సైన్స్ ఇన్ ట్వంటీయత్ సెంచరీ ఇండియా సైన్స్' పుస్తకం జాహ్నవికి ఎంతో పేరు తెచ్చింది. 'కీ కాన్సెప్ట్స్ ఇన్ మోడ్రన్ ఇండియన్ స్టడీస్'కు కో–ఎడిటర్‌గా వ్యవహరించింది. 'సైక్లోట్రాన్' పేరుతో సైన్స్ డాక్యుమెంటరీ తీసింది. సైంటిఫిక్ ఇన్‌స్ట్రుమెంట్స్ ద్వారా కథలు చెప్పడం తనకు ఇష్టమైన పని.

'మెనూ గురించి తెలుసుకోవాలంటే మనం మొదట ఉండాల్సింది టేబుల్ దగ్గర' అంటున్న జాహ్నవి 'సైన్స్' అనే మెనూ గురించి తెలుసుకోవడానికి 'సైన్స్ గ్యాలరీ' అనే టేబుల్ దగ్గరికి ప్రజలను తీసుకువస్తుంది.

లండన్‌లోని కింగ్స్ కాలేజీ ఫ్యాకల్టీగా పనిచేసిన జాహ్నవి 2018లో 'బెంగళూరు సైన్స్ గ్యాలరీ' ఫౌండింగ్ మెంబర్‌గా నియమితురాలైంది.

ఉరుకుల పరుగుల పోటీ ప్రపంచానికి కాస్త దూరంగా... సృజనాత్మకంగా ఆలోచించేలా, సైన్స్‌కు దగ్గరయ్యేలా యువతను ఆకట్టుకోవడానికి 'బెంగళూరు సైన్స్ గ్యాలరీ' ద్వారా ప్రయత్నిస్తోంది జాహ్నవి.

'మ్యూజియం' వాతావరణం ఆమెకు కొత్త కాదు. 'సైన్స్ మ్యూజియం లండన్' ఎక్స్‌టర్నల్ క్యురేటర్‌గా పనిచేసి ఎన్నో అనుభవాలను సొంతం చేసుకుంది.

'మా టార్గెట్ ఆడియెన్స్ పదిహేనేళ్ల పైబడిన వారు అయినప్పటికీ అండర్ గ్రాడ్యుయేట్‌లు, పోస్ట్ గ్రాడ్యుయేట్‌లపై కూడా దృష్టి సారిస్తాం. అంతరిక్షానికి సంబంధించి సమకాలీన, భవిష్యత్ విషయాలపై దృష్టి పెట్టేలా గ్యాలరీ తోడ్పడుతుంది' అంటుంది జాహ్నవి.

శాస్త్రీయ విషయాలతో యువత మమేకం కావడానికి డిజిటల్ ఎగ్జిబిషన్ ద్వారా ప్రయత్నిస్తోంది జాహ్నవి. 'బ్రేకింగ్ ది వాల్స్ బిట్వీన్ సైన్స్ అండ్ కల్చర్' శీర్షికతో నిర్వహించిన ఆన్‌లైన్ సైన్స్ గ్యాలరీకి కూడా మంచి స్పందన వచ్చింది.


ఇన్ఫోసిస్ సైన్స్ ఫౌండేషన్ జాహ్నవిని హ్యుమానిటీస్ విభాగంలో 'ఇన్ఫోసిస్ ప్రైజ్'తో సత్కరించింది.


సైన్స్‌ను జాహ్నవి అర్థం చేసుకున్న కోణాన్ని, చేపడుతున్న కార్యక్రమాలను ఇన్ఫోసిస్ సైన్స్ ఫౌండేషన్ ప్రశంసించింది.

● నీటి పంట

షెల్ఫ్‌లో పండిద్దాం

శరవణన్ తాత సేంద్రియ సేద్యం చేశాడు, తండ్రి కెమికల్ ఫార్మింగ్ వెంట పరుగెత్తి దిగుబడి పెంచాడు. ఆ పరుగునే వారసత్వంగా అందుకున్న శరవణన్ కూడా 2006 వరకు కొనసాగించాడు. ఆ తర్వాత అతడు తన జీవితానికి తానే పరిశోధకుడయ్యాడు. పంట పొలం నుంచి ఇంటి అల్మరాల వరకు సాగిన ప్రయోగాల్లో మొక్కజొన్నను ఇంటిలోపల అరల్లో నీటితో పండిస్తున్నాడు. శరవణన్ ప్రయోగాలకు మెచ్చిన శాస్త్రీయమైన శాస్త్రవేత్తల సమాఖ్య ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ అతడిని 'ఇన్నోవేటివ్ ఫార్మర్ అవార్డ్'తో సత్కరించింది. శరవణన్ గురించి ఇంకా తెలుసుకోవాలంటే తమిళనాడు, నమక్కల్ జిల్లాలోని 'అరియగౌండమ్ పట్టి' బాట పట్టాల్సిందే.







శరవణన్



మట్టిలేని పంట

అది 2005, ప్రభుత్వం వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు చేపడుతూ మైక్రో ఇరిగేషన్ విధానాన్ని తెచ్చింది. డ్రిప్, స్ప్రింక్లర్ సాగును పరిచయం చేసింది. అందుకు అవసరమైన పరికరాలను రాయితీతో ఇచ్చింది. అప్పుడు ఓ తొలి అడుగు వేశాడు శరవణన్. అది తనను గేమ్ చేంజర్‌గా మారుస్తుందని ఊహించలేదతడు. ప్రయోగాత్మకంగా ఆచరణలో పెట్టాలనే ఆలోచన అలా ఉండగానే అతడు అప్పటి వరకు సాగు చేస్తున్న రసాయన ఎరువుల పంటను అంతు చిక్కని తెగులు తినేసింది. కృషి విజ్ఞానకేంద్రాల శిక్షణతో కొత్తపంథాలో నడిచాడతడు. వర్మీ కంపోస్ట్, పంచగవ్య, వేపచెక్క వంటి ప్రయోగాలన్నీ చేశాడు. ఆరు ఎకరాల పొలంలో పసుపు, వేరు శనగ, కూరగాయలు పండించాడు. వీటితో పాటు అక్వాకల్చర్, పాడి, కోళ్ల పరిశ్రమ, బయోగ్యాస్ ప్లాంట్‌లను కూడా నిర్వహించాడు. ఒక వ్యర్థాలు మరొక పంటకు ఎరువుగా మారే విధానాలన్నింటినీ ఏర్పాటు చేశాడు. తనకైతే వ్యవసాయ భూమి ఉంది కాబట్టి పాడి పశువులకు కావలసిన గడ్డికి సమస్య లేదు. పొలం లేని వాళ్లు పాడిపరిశ్రమ మీద ఉపాధి పొందేవారి కోసం ఓ ప్రత్యామ్నాయం ఉండాలనుకున్నాడు. ఆ ప్రయోగంలో భాగంగా హైడ్రోఫోనిక్ కల్చర్ మొదలు పెట్టారు. అంటే నీటితో పంటలు పండించే విధానం అన్నమాట. హైడ్రోఫోనిక్ కల్చర్‌లో కూరగాయలు పండించుకునే వాళ్లు సంబంధిత సామగ్రిని ఇంటి పైకప్పు మీద ఏర్పాటు చేసుకుంటూ ఉంటారు. శరవణన్ అదే ప్రయత్నాన్ని మొక్కజొన్న పంటను ఒక అల్మైరాలో చేసి చూపించాడు. శరవణన్ ప్రయోగాన్ని రైతులకు మోడల్‌గా చూపించింది కృషి విజ్ఞాన్ కేంద్రం. షెల్ఫ్ అరల్లో దశలవారీగా మొక్కజొన్న గింజలను వేస్తూ ఏడాదంతా పాడి పశువులకు పచ్చిగడ్డి అందేలా రూపొందించాడు. రైతులకు సౌకర్యంగా ఉండేటట్లు ఒక కిట్‌ను రూపొందించాడు. అర కేజీ మొక్కజొన్న గింజలతో ఐదుకేజీల గడ్డిని వారం రోజుల్లో సాధించవచ్చు. ఎనిమిదవ రోజు ఆ అరను ఖాళీ చేసి మళ్లీ కొత్తగింజలను వేసుకోవచ్చన్న మాట. ఇంట్లో నాలుగు షెల్ఫ్‌లుంటే చాలు రెండు పాడిగేదెల కడుపు నింపే మేత చేతికొస్తుంది.

విజయవంతమైన ప్రయోగాలు చేయాలంటే పెద్ద పెద్ద చదువులు చదివి ఉండాల్సిన అవసరం లేదు, ఆసక్తి, నిరంతర శ్రమ ఉంటే సాధించవచ్చని నిరూపించాడు శరవణన్. అతడు రైతులకు మార్గదర్శనం చేయడంతోపాటు వ్యవసాయ విద్యార్థులకు పాఠ్యాంశం అవుతున్నాడు.